సాక్షి పెద్దపల్లి
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



యువ జోరు.. పరుగుల హోరు..

ఓ వైపు సిక్సర్‌ల మోత.. మరోవైపు బౌండ రీల బాదుడు.. మైదానం మొత్తం పరుగుల వరద మధ్య 'సాక్షి' ప్రీమియర్‌ లీగ్‌ సీజన్‌ 4 క్రికెట్‌ పోటీలు సాగాయి. 8లో▸



ఇంటి పన్నుల తగ్గింపునకు ఆమోదం

మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల తగ్గించేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. అలాగే వివిధ సమస్యలపైనా సభ్యులు చర్చించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.3 /21.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం చలితోకూడిన ఈదురుగాలులు కొనసాగుతాయి. మధ్యాహ్నం ఎండవేడి పెరుగుతుంది.

న్యూస్‌రీల్‌

శ్రీఆదివరాహస్వామి సన్నిధిలో ఏసీపీ పూజలు



ఆదివరాహస్వామిని దర్శించుకుంటున్న ఏసీపీ ఎడ్ల మహేశ్‌

కమాన్‌పూర్‌(మంథని): మండలకేంద్రంలోని శ్రీఆదివరాహస్వామిని పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్‌ గురువారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఏసీపీకి అర్చకులు రామానుజం, డైరెక్టర్లు దండె కనుకరత్నం, లక్ష్మీ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాలతో సన్మానించారు. ఎంపీటీసీ కోలేటి చంద్రశేఖర్‌, ముప్పిడి బాలకృష్ణ ఉన్నారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ



ఏసీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్‌

పెద్దపల్లిరూరల్‌: ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్‌ అన్నారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. అనుమానితులు, అసాంఘిక శక్తుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ విధానం అమలుపర్చడంతోపాటు చట్టాలను ఉల్లంఘించే వారిపై చర్యలు ఉంటాయని వివరించారు. గంజాయి అమ్మినా.. నిల్వ ఉంచినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఏసీపీని సీఐలు ప్రదీప్‌కుమార్‌, ఇంద్రసేనారెడ్డి, అనిల్‌కుమార్‌, ఎస్సైలు రాజేశ్‌, ఉపేందర్‌, మహేందర్‌, శ్రీనివాస్‌, వెంకటకృష్ణ, రాజవర్ధన్‌, మౌనిక, వినిత, రవీందర్‌ కలిసి అభినందనలు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు సాధించేదాకా పోరాటం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉష

పెద్దపల్లిరూరల్‌: బీసీ రిజర్వేషన్లు పెంచాలని, బీసీ గణన చేపట్టాలని బీఎస్పీ చేపట్టిన రిలేదీక్ష శిబిరాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గురువారం సందర్శించారు. బీసీలంతా ఏకమై తమకు దక్కాల్సిన రిజర్వేషన్లకు ఉద్యమించాలని పేర్కొన్నారు. జనాభా ప్రకారం.. 60మంది బీసీలు ఉండాల్సిన చట్టసభలో కేవలం 23మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం సాగుతోందన్నారు. ఇందులో బీసీలంతా భాగస్వాములు కావాలన్నారు. పలువురు మహిళలను కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్‌, శేషాద్రి, గోపాల్‌, మధు, శారద, రాజబాబు, రమేశ్‌, పర్శరాం, శివమణి, సాధిక్‌, శ్రీధర్‌ తదితరులున్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న కుమార్‌ దీపక్‌

పాలకుర్తి: మలివిడత కంటివెలుగు కార్యక్రమాన్ని 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్‌ కలెక్టర్‌ (స్థానిక సంస్థలు) కుమార్‌ దీపక్‌ సూచించారు. గురువారం పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని వర్కర్స్‌ క్లబ్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు వైద్య శిబిరాన్ని సందర్శించారు. శిబిరానికి వచ్చే వారికి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎంపీడీవో లలిత, ఎంపీఓ షబ్బీర్‌పాషా, సర్పంచ్‌ వేణుగోపాలరావు, హెల్త్‌ సూపర్‌వైజర్‌ దేవాంజలి, ఏఎంఎం సరిత, ఆప్తాల్మిక్‌ అరుణ పాల్గొన్నారు. వైద్యశిబిరంలో మొత్తం 165 మందిని పరీక్షించి 30మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో 21 మందిని ఆపరేషన్‌ కోసం రెఫర్‌ చేసినట్లు వైద్యుడు సతీశ్‌రెడ్డి తెలిపారు.

పత్తి క్వింటాల్‌కు రూ.7,726

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌ యార్డులో గురువారం పత్తి క్వింటాల్‌కు రూ.7,726 పలికింది. కనిష్టంగా రూ.7,000 సరాసరి రూ.7,611గా నమోదైనట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్‌ పృథ్వీరాజ్‌ తెలిపారు.

గం'జాయ్‌'..!





పోలీసులు భారీగా పట్టుకున్న గంజాయి ప్యాకెట్లు

- పారిశ్రామిక ప్రాంతంలో గుప్పుమంటున్న ఘాటు
- రౌడీమూకల కనుసన్నల్లో విక్రయ దందా
- యువతను బానిసలుగా మారుస్తున్న వైనం
- మత్తులో నేరాలకు పాల్పడుతున్న యువకులు

> గోదావరిఖనికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో ఇంజినీరింగ్‌ పూర్తిచేసి ఇంటికి చేరాడు. ఇక్కడి నుంచే ఉద్యోగవేటలో ఉన్నాడు. స్నేహితులతో కలిసి రాత్రివేళ అడ్డాల్లో షికార్లు కొట్టి, గంజాయికి బానిసయ్యాడు. డబ్బుల కోసం సొంతింట్లోనే బంగారు ఆభరణాలు అపహరించే స్థాయికి చేరాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు మందలించినా అతడిలో మార్పురావడం లేదని, పోలీసులకు చెబితే కుమారుడి భవిష్యత్‌ పాడవుతుందని లోలోపల కుమిలిపోతున్నారు.

మత్తుకోసం కొత్తగా ప్రయోగాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ద్రావణం (హాష్‌) గంజాయి నుంచి తీసింది. గంజాయిని బస్తాలో సరఫరా, వినియోగించటం కంటే ఇలా చిన్నచిన్న బాటిళ్లతో రవాణా చేసేందుకు వీలుగా రామగుండంలో కొత్త పంథాలో దందా సాగిస్తున్నారు. 5ఎంఎల్‌ హాష్‌ రూ.2,000కే దొరుకుతుండటంతో మత్తు కోసం ప్రయోగాలు చేస్తున్న యువత దీన్ని తీసుకుంటూ గతేడాది పోలీసులకు పట్టుబడ్డారు. గతంలో సిగరేట్‌లలో గంజాయి నింపి కాల్చేవారు. తాజాగా హుక్కా మాదిరిగా ప్లాస్టిక్‌ బాటిల్‌కు రంధ్రం చేసి గంజాయి నింపిన సిగరేట్‌, ప్రత్యేకమైన బాల్‌ పెన్నులను జోడించి మంటపెడతారు. అందులో నుంచి వచ్చే ఆవిరిని హుక్కా మాదిరిగా పీల్చుతున్నారు.

గంజాయి కేసుల వివరాలు

ఏడాది	కేసులు	స్వాధీనం (కిలోల్లో)
2020	11	32.90
2021	20	51.45
2022	13	8.32

సాక్షి, పెద్దపల్లి: గంజాయ్‌ మత్తు యువతను చిత్తు చేస్తోంది. జిల్లాలో రోజురోజుకూ గంజాయి వినియోగం, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గంజాయి గుప్పుమంటూ యువతను పెడదారి పట్టిస్తోంది. సరదాగా చేసుకున్న అలవాటు కాస్తా వ్యసనంగా మారి యువత దానికి బానిసలవుతున్నారు. ఒకరిని చూసి మరొకరు అన్నట్లు యువత అలవాటు చేసుకుంటున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. గంజాయిదందాలో దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు రౌడీమూకలు వారికి గంజాయి సరఫరా చేస్తూ గ్యాంగ్‌లను తయారు చేసుకుంటున్నారు. గంజాయి దందాలో వచ్చే ఆదాయంతో వాటిని మెయింటనెన్స్‌ చేస్తూ సెటిల్మెంట్‌ చేస్తున్నారు. గతంలో హత్య చేయబడిన ధనాల చిన్న, మంథని సుమన్‌ మధ్య గంజాయి దందాలో వచ్చిన విభేదాలతోనే హత్య చేయడానికి కారణమనే ఆరోపణలున్నాయి.

ఇక్కడే ప్రధానంగా..

మహారాష్ట్ర సరిహద్దున ఉన్న పెన్‌గంగ, ప్రాణహిత నదితీరంలో.. భద్రాచలం, భూపాలపల్లిలో గోదావరి తీరంలో అంతర్‌పంటగా గంజాయి సాగవుతోంది. అక్కడి నుంచి రైలు, రోడ్డు మార్గంలో జిల్లాలోకి ప్రవేశిస్తోంది. అక్కడి నుంచి గోదావరి ఫిల్టర్‌బెడ్‌, మేడిపల్లి ఓసీ–4 దారిలో నిర్మానుష్య ప్రాంతాల్లో వాటిని విక్రయిస్తున్నారు. అక్కడి నుంచి ధూళిపేట, గంగానగర్‌, హన్మంత్‌నగర్‌, యైటింక్లయిన్‌కాలనీ, ఎన్టీపీసీ, మల్కాపూర్‌, ఇందిరమ్మకాలనీ, పీకేరామయ్యకాలనీ, ఎల్కలపల్లిలోని నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని అడ్డాల సమాచారం పోలీసులకు తెలిసి ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్నా.. ఆయా అడ్డాల సమీపంలోకి మాత్రం పోవడం లేదనే ఆరోపణలున్నాయి. అలాగే జిల్లాలో వివిధ పరిశ్రమలు, ఇటుక బట్టీలు, రైస్‌మిల్లుల్లో పనిచేసేందుకు వలస కార్మికులు ఎక్కువగా వస్తారు. వారు మత్తు కోసం గంజాయి తీసుకుంటున్నారు. వారి ద్వారా వివిధ ప్రాంతాల నుంచి జిల్లాలోకి దిగుమతి అవుతోంది.

ఉదాసీనత ఎందుకో..?

గంజాయి పీల్చే యువకులు వందల సంఖ్యలో ఉన్నా.. వారందరికీ సరఫరా చేసే వ్యక్తులు తక్కువ సంఖ్యలో ఉంటారని తెలిసింది. స్థానికంగా వారెవరో పోలీస్‌లకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కమిషనరేట్‌ అధికారులు ఉండే నగరంలో గంజాయి అమ్మకాలు, సరఫరా బాహాటంగానే సాగుతున్నాయి. మామూళ్ల మత్తులో మునిగిన అధికారులు, రాజకీయ నేతలు, రౌడీషీటర్లకు గంజాయి దందాతో సంబంధం ఉండటంతో స్థానికేతరులపైనే కేసులు నమోదుచేస్తున్నారని, స్థానికంగా ఉన్నవారిని తప్పిస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో అడ్డుకట్టపడటం లేదని విమర్శిస్తున్నారు. అలాగే పోలీస్‌, ఎక్సైజ్‌, రైల్వే అధికారులు అక్రమ రవాణాదారులను పట్టుకోవడంలో విఫలమవుతున్నారు. ఇందుకు ఈ శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే ప్రధాన కారణం.

దొరికితే జైలే..

ఎవరైనా గంజాయి విక్రయించినా.. వినియోగించినా వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాం. కమిషనరేట్‌ పరిధిలో నిరంతరం తనిఖీలు చేపడుతున్నం. గంజాయి విక్రయిస్తున్న ప్రాంతాలను గుర్తించి.. విక్రయిస్తున్న వారిపై కేసులు పెడతాం. గంజాయి సేవిస్తున్న యువత, విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్‌ ఇస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలి. వ్యసనాలకు బానిసలు కాకుండా చూడాల్సిన అవసరం ఉంది.

– గిరి ప్రసాద్‌, ఏసీపీ, గోదావరిఖని

పెరుగుతదా..! తగ్గుతదా..!!



ఈ ఫొటోలో ఉన్న రైతు మేకల శ్రీనివాస్‌. పెద్దపల్లి మండలం హన్మంతునిపేట. తనకున్న ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. కొనుగోళ్లు మొదలైన వారంలో 15 క్వింటాళ్లను క్వింటాల్‌కు రూ.8,500 చొప్పున అమ్ముకున్నాడు. మిగిలిన పత్తిని నిల్వ చేశాడు. క్వింటాల్‌కు రూ.10 వేలు దాటుతుందని ఆశపడినా.. ఇపుడు రూ.8వేలు కూడా దాటని పరిస్థితి ఉంది. ఇంట్లో నిల్వ ఉన్న పత్తిని అమ్మాలా.. ఉంచాలా తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

ఈ పరిస్థితి ఒక్క శ్రీనివాస్‌దే కాదు.. జిల్లాలోని చాలా మంది రైతులది. ఆరంభంలో రూ.9వేలకు పైగా పలికిన పత్తి ధర తాజాగా పడిపోయింది. మార్కెట్‌కు వందలాది క్వింటాళ్ల పత్తి వచ్చినపుడు పెరిగి ఉన్న ధర ఇపుడు క్రమంగా పడిపోతుండడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ వెయ్యి క్వింటాళ్లకు పైగా కొనుగోళ్లు సాగుతున్నాయి. ధర మాత్రం కనీసం రూ.8వేలు చేరడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- 'తెల్ల'బోతున్న పత్తిరైతులు
- ఆరంభంలోనే అ'ధర'హో..
- తగ్గిన ధర.. పెరిగిన కొనుగోళ్లు

పెద్దపల్లిరూరల్‌: పత్తి పంట సాగుచేసిన రైతులు ధర క్వింటాల్‌కు రూ.10 వేలు దాటితే అమ్ముకుందామని ఇళ్లు.. చేల వద్ద నిల్వ ఉంచారు. గురువారం మార్కెట్లో పత్తి క్వింటాల్‌కు రూ.గరిష్ఠంగా రూ.7,861, కనిష్ఠంగా రూ.7,001 మాత్రమే పలికింది. పక్షం రోజులుగా దాదాపు ఇదే పరిస్థితి. ధర పెరుగుతుందా..? లేదా..? అన్న విషయమై స్పష్టత కనిపించకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

బోణి కొట్టని సీసీఐ

పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలోని జిన్నింగ్‌ మిల్లులో కాటన్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా (సీసీఐ) అధికారులు ఏర్పాటు చేసిన కేంద్రంలో ఇప్పటివరకు కొనుగోళ్లే మొదలు కాలేదు. సీసీఐ నిబంధనలు, ధరలను చూస్తే సీసీఐ కన్నా వ్యాపారులు చెల్లించే ధరలే ఎక్కువగా ఉండడంతో రైతులు సీసీఐ వైపు చూడడం లేదు.

నాణ్యమైన పత్తికి మంచి ధర



రైతులు నాణ్యమైన పత్తిని తెచ్చి మంచి ధర పొందాలి. 8 శాతం తేమ కలిగిఉండి, నీళ్లు చల్లకుండా పత్తిని తేవాలి. బరువు ఎక్కువ వస్తుందని నీళ్లు చల్లితే పత్తి రంగు మారి నాణ్యత దెబ్బతింటుంది. రోజురోజుకూ మార్కెట్‌కు పత్తి రాబడి పెరుగుతున్నందున రైతులు సకాలంలో వచ్చి సహకరించాలి.

– దేవరాజ్‌ పృథ్వీరాజ్‌, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి

ఈ–నామ్‌ కొనుగోళ్లు..

మార్కెట్లో ఈ–నామ్‌ పద్ధతిన కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతులు పత్తి నిల్వలను ఉదయం 9గంటల వరకే యార్డుకు తేవాలని మార్కెటింగ్‌ అధికారులు పేర్కొంటున్నారు. లాట్‌నంబరు అలాట్‌ అయ్యాక వ్యాపారులు బిడ్డింగ్‌ చేయడం, ఆ తర్వాత ఆన్‌లైన్‌ తూకం వేసే ప్రక్రియ మధ్యాహ్నం వరకు పూర్తయ్యేలా రైతులు సహకరించాలని కోరుతున్నారు.

సంచార ప్రయోగశాలతో విద్యార్థుల్లో పరిశీలనాత్మక శక్తి

- సైన్స్‌ అధికారి రవినందన్‌ రావు



విజ్ఞాన ప్రయోగశాల వద్ద జిల్లా సైన్స్‌ అధికారి బి.రవినందన్‌ రావు

సుల్తానాబాద్‌: విద్యార్థుల్లో శాస్త్రీయ అభిరుచి, పరిశీలనాత్మక శక్తిని పెంపొందించాలనే ప్రధాన లక్ష్యంతో సంచార విజ్ఞాన, గణిత ప్రయోగశాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా సైన్స్‌ అధికారి బి.రవినందన్‌రావు అన్నారు. గురువారం మండలంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల (బాలురు), గట్టెపల్లిలో సంచార ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు పలు ప్రయోగాలు చేసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 10వ తరగతి పాఠ్య పుస్తకాల్లోని కఠిన అంశాలను కృత్యాధార బోధన ద్వారా సులభంగా అర్థమయ్యేలా వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 122 ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 71 పాఠశాలల్లో అమలు చేసినట్లు తెలిపారు. కలెక్టర్‌, డీఈవో ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.శారద, కె రవికుమార్‌, రిసోర్స్‌ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెరుచుకోని నవోదయ వెబ్‌సైట్‌

సుల్తానాబాద్‌: నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు కేంద్రప్రభుత్వం విద్యార్థులను ఆహ్వానించింది. ఐదో తరగతి పూర్తి చేసుకున్న వారు ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌ విడుదల చేసింది. చొప్పదండిలో నవోదయ పాఠశాల ఉంది. గతనెల 30 గడువుగా ప్రకటించిన ప్రభుత్వం వెబ్‌సైట్‌ ఓపెన్‌ కాకపోవడంతో ఈనెల 8వరకు గడువు పొడిగించింది. అయినా వెబ్‌సైట్‌ ఓపెన్‌ కావడం లేదు. దీంతో తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు.

5న మేడారంలో కోర్టు ప్రారంభం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రధాన న్యాయమూర్తి నాగరాజు, ఏసీపీ మహేశ్‌

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేతులమీదుగా..
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి..

ధర్మారం: మండలంలోని నందిమేడారంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న న్యాయస్థానాన్ని ఈనెల 5న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జ్వల్‌భూయాన్‌, న్యాయమూర్తి పానుగోటి నవీన్‌రావు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మేడారంలో కోర్టు ఏర్పాటుతో ధర్మారం, జూలపల్లి మండలాల్లోని కేసులను త్వరితగతిన పరిష్కరించే అవకాశాలున్నట్లు న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారు. సీనియర్‌ సివిల్‌ జడ్జి అర్జున్‌, ఏసీపీ మహేష్‌, సీఐ ప్రదీప్‌కుమార్‌, ఎస్సై శ్రీనివాస్‌, ఎంపీడీవో జయశీల, పెద్దపల్లి బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సురేష్‌బాబు, న్యాయవాదులు గడ్డం లింగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామడుగు రాజేశ్‌, ఆకారి రాజేశం పాల్గొన్నారు.

మల్కాపూర్‌ వరకు కరకట్ట నిర్మించాలి



జనగామలో వృద్ధురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చందర్‌

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌

గోదావరిఖని: వరద నీరు గ్రామాల్లోకి రాకుండా జనగామ నుంచి మల్కాపూర్‌ వరకు కరకట్ట నిర్మించాలని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ సింగరేణిని కోరారు. 'గడపగడపకూ కేసీఆర్‌ సంక్షేమ పథకాలు.. ఇంటింటికీ చందరన్న' పాదయాత్రలో భాగంగా జనగామలో పర్యటించారు. కరకట్ట విషయంపై త్వరలో సింగరేణి యాజమాన్యాన్ని కలుస్తానన్నారు. బుధవారం రాత్రి గ్రామంలో నిద్ర చేసిన చేసిన ఆయన గురువారం ఉదయం జనగామ శ్రీత్రిలింగరాజరాజేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం మెచ్చిన నాయకుడు కేసీఆర్‌ అన్నారు. సంక్షేమపథకం అందని గడప లేదన్నారు. నాలుగేళ్లుగా ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, నిత్యం 16గంటలు ప్రజాక్షేత్రంలోనే ఉంటున్నామని వివరించారు. డివిజన్లకు అధిక మొత్తంలో నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. కార్పొరేటర్లు జనగామ కవితసరోజిని, దాతు శ్రీనివాస్‌, సాగంటి శంకర్‌, ఇంజపురి పులేందర్‌, జెడ్పీటీసీ ఆముల నారాయణ, నాయకులు తోకల రమేశ్‌, అచ్చే వేణు, గంగ శ్రీనివాస్‌, అడబత్తుల మల్లేశ్‌, జనగామ చంద్రయ్య పాల్గొన్నారు.

మీరు వింటున్నారు.. రామగుండం ఆకాశవాణి కేంద్రం నుంచి..

- త్వరలో అందుబాటులోకి రానున్న ప్రసారాలు
- 15 కిలోమీటర్ల మేర రిలే కేంద్రం కార్యక్రమాలు
- వర్చువల్‌ ద్వారా త్వరలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ

జ్యోతినగర్‌: 'శ్రోతలకు విజ్ఞప్తి. మీరు వింటున్నారు.. ఆకాశవాణి రామగుండం కేంద్రం నుంచి..' అనే మాటలు ఇకనుంచి వినిపించనున్నాయి. అదేంటి అనుకుంటున్నారా..! నిజమే.. త్వరలోనే రామగుండం కేంద్రంగా ఆకాశవాణి ప్రసారాలు అందుబాటులోకి రానున్నాయి. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌ (2018లో మూతబడిన దూరదర్శన్‌ రిలేకేంద్రం)లో ఎఫ్‌ఎం రిలే కేంద్రం త్వరలో ప్రారంభం కానుంది. ఈ ఆకాశవాణి కేంద్రాన్ని జనవరి 26న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో వాయిదా పడింది.

రిలే కేంద్రంలో ఏర్పాట్లు

ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని ఆకాశవాణి రిలే కేంద్రంలో హైదరాబాద్‌ కేంద్రంగా ఎఫ్‌ఎం ప్రసారాలు ఈ ప్రాంత ప్రజలకు చేరవకానున్నాయి. 100వాట్స్‌ రిలే కేంద్రంగా ట్రాన్స్‌మిషన్‌ ఏర్పాటు చేస్తున్నారు. రేడియో ప్రసారాలు 100.1 ఎంహెచ్‌జెడ్‌ ద్వారా ప్రసారాలు అందనున్నాయి. జిల్లాలో రామగుండం అటు పారిశ్రామికప్రాంతంగా ఉండడంతోపాటు అతిపెద్ద కార్పొరేషన్‌గా ఉండటంతోనే కేంద్ర ప్రభుత్వం రిలే కేంద్రాన్ని మంజూరు చేసినట్లు సమాచారం. ప్రారంభం రోజున 100.1 నంబర్‌పై జాతీయ గీతం ప్రసారం కానుంది.



ఎన్టీపీసీ టీటీఎస్‌లోని ఆకాశవాణి రిలే కేంద్రం

పనులు జరుగుతున్నాయి.



రిలే కేంద్రంలో టెక్నికల్‌ పనులు పూర్తికావస్తున్నాయి. త్వరలో ప్రారంభం తేదీని అధికారులు ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ప్రజలకు హైదరాబాద్‌ ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రసారమయ్యే కార్యక్రమాలు అందనున్నాయి. 100.1 నంబర్‌పై రేడియో ద్వారా వినవచ్చు.

– ఆర్‌.శ్రీనివాస్‌, టెక్నీషియన్‌, ఆకాశవాణి రిలే కేంద్రం

క్లుప్తంగా

మెయిన్ మాగ్జిన్ గదులకు పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఆర్జీ-2 జీఎం

గోదావరిఖని: మెయిన్ మాగ్జిన్ గదులకు ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీడీకే-5 ఓసీపీ విస్తరణలో భాగంగా ఉప్పట్లకేసారం వద్దకు మార్చి రూ.9.5 కోట్ల వ్యయంతో నిర్మించారు. గనులకు సరఫరా చేసే పేలుడు పదార్థాలు ఇక్కడ నిల్వ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, రక్షణ అధికారి బి.రవీందర్, డీజీఎం సివిల్ ధనుంజయ, డీజీఎం స్టోర్స్ సజన్‌మెహ్రా తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా సబ్ జూనియర్స్, కెడెట్ జూడో జట్ల ఎంపిక

సుల్తానాబాద్: జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ జిల్లాకేంద్రం మంకమ్మతోటలోగల సాయి మానేరు పాఠశాలలోని జూడో అకాడమీలో సబ్ జూనియర్స్, కెడెట్ బాలబాలికల జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జూడో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాటేటి సంజీవ్ కుమార్, సిలివేరి మహేందర్ తెలిపారు. సబ్ జూనియర్స్ బాలురు 30 నుంచి 66కిలోలతోపాటు ఆపై, బాలికలు 28 కిలోల నుంచి 57 కిలోలు, ఆపై, కెడెట్ బాలురు 50 కిలోల నుంచి 90కిలోలు, ఆపై, బాలికలు 40 కిలోల నుంచి 70కిలోలు, ఆపై విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. సబ్ జూనియర్స్ విభాగానికి 2008, 2009, 2010, కెడెట్ విభాగానికి 2005, 2006, 2007లో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన వారు ఈనెల 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఆసక్తి గలవారు ఉదయం 11 గంటలకు జూడో అకాడమీలో రిపోర్టు చేయాలని, వివరాలకు 9949830494 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గురుకులాల్లో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

రామగుండం: 2023-24 విద్యా సంవత్సరంలో గురుకులం విద్యాలయాల్లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి మంజుల తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం (ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశాలకు మార్చి 5న పరీక్ష ఉంటుందని, అర్హులు ఈనెల 5లోగా www.trwreiracin, www.tftwfurukuam.gov.i n లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి బస్టాండ్ వద్ద గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని జూలపల్లి మండల కేంద్రానికి చెందిన మెర్గు రమేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. రమేశ్ పాల వ్యాపారి. బంజేరుపల్లి బస్టాండ్ వద్ద పాలుపోసి నిలుచున్నాడు. గుర్తుతెలియని వాహనం వచ్చి ఢీకొంది. రమేశ్ కాలుకు తీవ్ర గాయమైంది. అతడిని 108లో ఆసుపత్రికి తరలించారు.

యువ జోరు.. పరుగుల హోరు..









సీనియర్స్ విభాగంలో ఫైనల్‌కు చేరిన వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు, హోరాహోరీగా తలపడుతున్న జట్లు, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

- ఎస్‌పీఎల్ సీజన్-4లో తొలి అర్ధసెంచరీ నమోదు
- రెండో రోజు పోటీలను ప్రారంభించిన డీటీసీ చంద్రశేఖర్ గౌడ్
- సీనియర్స్ ఫైనల్‌లో వాగ్దేవి కళాశాల, మంచిర్యాల

కరీంనగర్‌స్పోర్ట్స్: అసలు క్రికెట్ పోరు అంటే ఇదేనేమో.. ఓ వైపు సిక్సర్‌ల మోత.. మరోవైపు బౌండరీల బాదుడు.. ఇలా మైదానం మొత్తం పరుగుల వరదను పారిస్తుంటే ప్రేక్షకులు, తోటి క్రీడాకారుల కేకలు, ఈలల మధ్య 'సాక్షి' ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా, హోరాహోరీగా సాగాయి. ఈ సీజన్‌లో తొలి అర్ధ సెంచరీని వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్ సాయి నమోదు చేశాడు. నేడు సీనియర్స్ సెమీఫైనల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్..

క్రీడలతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, క్రీడల్లో రాణించినట్లే విద్యలోనూ రాణించాలని ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారి మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. ఎస్‌పీఎల్ రెండో రోజు పోటీలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, కరీంనగర్ బ్యూరో చీఫ్ బాషబోయిన అనిల్ కుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాసరావు, సాక్షి సిబ్బంది సిలివేరి మహేందర్, రాకేష్, పరుషరాం, జ్యోతిష్మతి కళాశాల పీడీ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ విశ్వప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



అర్ధసెంచరీ చేసిన నిఖిల్ సాయి

తొలి అర్ధసెంచరీ నమోదు

వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్ సాయి ట్రినిటీ కళాశాలతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కేవలం 24 బంతుల్లో 4 సిక్స్‌లు, 6 ఫోర్లతో 51 పరుగులు చేసి అర్ధసెంచరీని నమోదు చేశాడు. అదే కళాశాలకు చెందిన సాయి కృష్ణారెడ్డి 21 బంతుల్లో 3 సిక్స్‌లు, 6 ఫోర్లతో 46 పరుగులు చేయగా.. సెమీస్‌లో 18 బంతుల్లో ఒక సిక్స్, 4 ఫోర్లతో 34 పరుగులు చేశారు. అశ్వక్ 3 వికెట్లు, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నౌమాన్ 10 బంతుల్లో 3 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 25 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీశాడు.

రెండో రోజు ఫలితాలు

- జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్, ఎస్సారార్ కళాశాల కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎస్సారార్ కళాశాల 51 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌లో ప్రవేశించింది. జట్టులో అల్పీ, నవీన్ రాణించారు
- జేఎన్‌టీయూ మంథని, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీ చైతన్య జట్టు 32 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. జట్టులో నౌమాన్, అరవింద్ రాణించారు.
- వాగ్దేవి డిగ్రీ కళాశాల మంచిర్యాల, ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల పెద్దపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వాగ్దేవి జట్టు 70 పరుగులు భారీ విజయాన్ని నమోదు చేసింది. జట్టులో నిఖిల్ సాయి, సాయికృష్ణారెడ్డి రాణించారు.
- వాగ్దేవి డిగ్రీ కళాశాల మంచిర్యాల, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసి సీనియర్స్ విభాగంలో ఫైనల్‌లో ప్రవేశించింది.

ఇంటి పన్నుల తగ్గింపునకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్ పర్సన్ ముత్యం సునీతగౌడ్

- ముస్లిం శ్మశాన వాటికలో సెంట్రల్ లైటింగ్
- 17 అంశాలపై పాలకవర్గం చర్చ
- సుల్తానాబాద్ మున్సిపల్ సమావేశం

సుల్తానాబాద్: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల తగ్గించేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. అలాగే వివిధ సమస్యలపైనా సభ్యులు చర్చించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్ అధ్యక్షతన గురువారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముస్లిం శ్మశానవాటికలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సభ్యులు ఆమోదించారు. మొత్తంగా 17అంశాలతోపాటు ఇతర బిల్లులు, అభివృద్ధి కార్యక్రమాల తీర్మానాలకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీకి ఉన్నప్పుడు 0.60 శాతానికి ఆస్తిపన్ను పెంచారని, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సూచన మేరకు దానిని 0.50 శాతానికి తగ్గిస్తూ పాలకవర్గం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల చనిపోయిన కో-ఆప్షన్ సభ్యుడు గొట్టం మల్లయ్యకు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ అలీమోద్దీన్, కౌన్సిలర్లు రాజయ్య, కూకట్ల గోపి, తిరుపతి, గుర్రాల శ్రీనివాస్, జ్ఞానేశ్వరి, హనుమల అరుణ, మమత, సునీత, సాజిత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బందులు పట్టించుకోరా..!

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని 19, 20, 24 వార్డుల్లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం పర్యటించారు. ప్రజాసమస్యలపై ఆరా తీశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలకులు పాలనను గాలికొదిలేసి, స్వార్థపూరిత ఆలోచనతో పనిచేస్తున్నారని విమర్శించారు. పెద్దపల్లి పట్టణం జిల్లా, మున్సిపల్ కేంద్రంగా హోదా కల్పించారే తప్ప అందుకనుగుణంగా సౌకర్యాలను కల్పించలేదన్నారు. పారిశుధ్యం అధ్వానంగా మారిందని, తాగునీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉందని, మిషన్‌భగీరథ జాడే లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్‌రావు, అన్నయ్యగౌడ్, బుషణవేన రమేశ్‌గౌడ్, సంపత్, మల్లయ్య, తూముల సుభాష్‌రావు, బొడ్డుపల్లి శ్రీను, భార్గవ్, చుంచు శ్రీకాంత్, రమేశ్, మహేశ్, జగదీశ్; తిరుపతి తదితరులున్నారు.

ఉత్తమ అధికారులకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల నుంచి ఉత్తమ అధికారులుగా ఎన్నికైన ఓసీపీ-2 ప్రాజెక్ట్ అధికారి మత్స్యగిరీ నరేందర్, ఏపీఏ నుంచి ఉత్తమ అధికారిగా ఎన్నికైన డిప్యూటీ మేనేజర్ కటుకూరి శ్రీకాంత్‌ను గురువారం పలువురు శాలువాలతో సన్మానించారు. ఏపీఏ పరిధిలోని అడ్రియాల లాంగ్ ప్రాజెక్ట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీఏ జీఎం కే.వెంకటేశ్వర్లు, రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఏఎల్పీ ప్రాజెక్ట్ అధికారి కొలిపాక నాగేశ్వర్‌రావు శ్రీకాంత్‌ను, ఓసీపీ-2 ప్రాజెక్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షురాలు బూక్యా ఆశాకుమారి నరేందర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ఏరియా ఇంజినీర్ సీతారామం, ప్రాజెక్టు ఇంజినీర్ రఘురాం, గని మేనేజర్లు జనార్దన్, తిరుపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం

- మార్చి మొదటివారంలో ప్రారంభానికి చర్యలు
- పనులు పరిశీలించిన ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్ర ఆసుపత్రి ఆవరణలో ఐదు పడకలతో కూడిన డయాలసిస్ సెంటర్ మంజూరైంది. ఈ కేంద్రం మార్చి మొదటివారంలో అందుబాటులోకి రానుంది. డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకోసం చేపట్టిన పనులను గురువారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఇంజినీరింగ్ అధికారి రాజారెడ్డితో కలిసి పరిశీలించారు. పనులు సాగుతున్న తీరుపై ఆరా తీశారు. వీలైనంత త్వరగా సెంటర్‌ను వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. అనంతరం పారిశుధ్య పనులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.



డీసీహెచ్ఎస్ శ్రీధర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ప్రమాదవశాత్తు పత్తిదగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

పాలకుర్తి: మండలంలోని కన్నాల పరిధి బోడగుట్టపల్లికి చెందిన రాపెల్లి రాజేశం తన ఇంటి వద్ద నిల్వ చేసిన పత్తి గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. నాలుగెకరాల చేనులోని పత్తి ఏరిన రాజేశం.. ఇంటివద్ద రేకులషెడ్డులో నిల్వచేశాడు. ఎప్పటిలాగే పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో మంటలు చెలరేగడాన్ని గమనించిన స్థానికులు రాజేశానికి సమాచారం అందించి.. మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. బసంత్‌నగర్ పోలీసులు పెద్దపల్లి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా.. వెంటనే ఫైర్ సిబ్బంది స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని ఆర్పివేశారు. ఘటనలో దాదాపు 10క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాజేశం తెలిపారు. రాజేశం ఇంటి సమీపంలోని ఓ వ్యక్తి తన చేనులో చెత్తను కాల్చుతుండగా.. అందులోనుండి నిప్పురవ్వలు పడటంతోనే సంఘటన జరిగినట్లు బాధితుడు రాజేశం బసంత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సింగరేణి కార్మికుడి ఇంట్లో చోరీ

గోదావరిఖని: గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలో డి-187 సింగరేణి క్వార్టర్‌లో నివాసముంటున్న సింగరేణి కార్మికుడు కొత్తకోట హనుమంతు ఇంట్లో చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం ఊరికి వెళ్లాడు. గురువారం వచ్చి చూడగా ఈ విషయం బయటపడింది. ఘటనలో రెండు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.90వేల నగదు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు.

తోడూనీడగా..



కాల్వశ్రీరాంపూర్: ఒకరు నొకరు.. తోడునీడగా కలిసి నడుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ వృద్ధ దంపతులు. మండలంలోని కూనారం గ్రామానికి చెందిన కొత్తూరు లక్ష్మి, భూమయ్య దంపతులు. భూమయ్యకు పింఛన్ వస్తోంది. అయితే ఆయనకు కళ్లు సరిగా కనపడవు. దీంతో భార్య లక్ష్మి ఇలా.. భర్తను వెంటేసుకుని బ్యాంకుకు నడుచుకుంటూ వచ్చింది. తన భర్తకు కంటి ఆపరేషన్ చేయించాలని విజ్ఞప్తి చేస్తోంది.

ఉత్పత్తిలో అగ్రగామిగా ఆర్జీ-1

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తిలో ఆర్జీ-1 అగ్రగామిగా నిలుస్తోందని జీఎం కె.నారాయణ పేర్కొన్నారు. గురువారం జీడీకే-5 ఓసీపీలో విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్మికుల సౌకర్యార్థం ల్యాంప్ రూమ్‌గా ఉన్న భవనాన్ని ఆధునీకరించి టైల్స్, ఫాల్ సీలింగ్, లైటింగ్, పార్టేషన్‌లతో తక్కువ సమయంలో అధునీకరించారన్నారు. ఉపాధ్యక్షులు గంధ్ర దామోధర్‌రావు, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, ఏజీఎం ఫైనాన్స్ రామకృష్ణ, డీజీఎం సివిల్ నవీన్, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాపూర్(మానకొండూర్): తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీకి చెందిన పెరుమల్ల వీరమల్లు (53) కుటుంబ కలహాలతో గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. వీరమల్లు నిత్యం మద్యం సేవించి కుటుంబసభ్యులతో గొడవకు దిగేవాడని, ఈ క్ర మంలో భార్య ఎల్లమ్మ, కుమారులు వేరుగా ఉంటున్నారని అన్నారు. దీంతో మనోవేదనకు గురై ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఘటన స్థలంలో వివరాలు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గుండారం గ్రామానికి చెందిన మైదంపల్లి రాజమ్మ(85) గురువారం ప్రమాదవశాత్తు బా విలో పడి మృతిచెందింది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. రాజమ్మ కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతోంది. ఈక్రమంలో గ్రామ శివారులోని వారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లింది. బావి వద్ద తిరుగుతుండగా కాలుజారి అందులో పడిపోయింది. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఎల్లారావు గతంలోనే అనారోగ్యంతో మరణించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఐఎన్‌టీయూసీ కార్మికుల పక్షపాతి

- యూనియన్ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఐఎన్టీయూసీ కార్మికుల పక్షపాతి అని, ఎన్టీపీసీ సంస్థ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ ముందంజలో ఉందని యూనియన్ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. గురువారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. సంస్థ ఎదుగుదలకు ఉద్యోగులుగా తమవంతు బాధ్యతను నిర్వహించడంతోపాటు యూనియన్ పరంగా సమస్యలనూ పరిష్కరించే బాధ్యత నాయకులపై ఉందన్నారు. సంస్థలో ఉద్యోగ గుర్తింపు సంఘంగా విజయం సాధించిన క్రమంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కొత్త కార్యవర్గాన్ని సన్మానించారు. నాయకులు కందుల స్వామి, బండారి కనకయ్య, ఆరెపల్లి రాజేశ్వర్, అశోక్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఐన్టీయూసీ ఉద్యోగ గుర్తింపు సంఘం కార్యవర్గాన్ని జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి ఆమోదంతో బాబర్ సలీంపాషా ప్రకటించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాసర్ల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా కొలిపాక మల్లయ్య, కోశాధికారిగా ముత్యాల శ్రీనివాస్ నియామకం అయ్యారు.

ఆదాయ పన్ను నుంచి కార్మికులకు మినహాయింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి క్రిష్ణ

గోదావరిఖని: ఆదాయపన్ను నుంచి బొగ్గు గని కార్మికులకు మినహాయింపు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.క్రిష్ణ డిమాండ్ చేశారు. గురువారం జీడీకే-11గనిలో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రాజకీయ పార్టీలు బొగ్గు గని కార్మికులకు ఆదాయపన్ను రద్దు చేస్తామని హామీలు ఇచ్చి విస్మరించాయన్నారు. పార్లమెంట్‌లో పార్టీల ఎంపీలు ఏలాంటి ప్రయత్నాలూ చేయలేదన్నారు. ఏటా ఆదాయ పన్ను పేరుతో కార్మికులు భారీగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో కూడా ఆశించిన స్థాయిలో మినహాయింపు ఇవ్వలేదన్నారు. ఈనెల 4న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగే సంఘం 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు నరేశ్, ఎం.కొమురయ్య, ఎస్‌సీ.బాబు, పి.మొండయ్య, శేఖర్, కె.మొగిలి పాల్గొన్నారు.

రేపు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలు



వాల్ పోస్టర్ అవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ

యైటింక్లయిన్‌కాలనీ: ఈనెల 4న గోదావరిఖనిలో తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) 11వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ తెలిపారు. గురువారం ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని ప్రెస్‌భవన్‌లో మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. 1981లో ఆవిర్భవించిన సంఘం.. ఉమ్మడి ఆరు జిల్లాల్లో.. 11 ఏరియాలకు విస్తరించిందని, కార్మికుల పక్షాన పోరాడుతోందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను మహాసభల్లో చర్చిస్తామన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్, అశోక్, నాయకులు రాయమల్లు, కొమురయ్య, బాబు, మొండయ్య, అబేద్నేగో, మొగిలి, లింగయ్య, రాజయ్య, బుచ్చమ్మ, పద్మ, సమ్మక్క, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన మిరాల రాజు గుడిసె షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. రాజు కుటుంబ సభ్యులు గుడెసకు తాళం వేసి కూలీ పనులకు వెళ్లారు. గుడిసెలో నుంచి మంటలు రావడంతో ఇంటిపక్కవారు మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. అదే సమయంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు పెద్దపల్లి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. ఘటనలో గుడిసెలో ఉన్న వస్తువులన్నీ కాలిపోయి. మొత్తంగా రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాజు తెలిపారు. తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, ఆర్ఐ సంధాని, సర్పంచ్ కట్కం రవీందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మాజీ ఎంపీటీసీ కట్కం నారాయణ రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.